డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 21న మోడల్ డీఎస్సీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 21న మోడల్ డీఎస్సీ నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, కసాపురం రమేష్ తెలిపారు. సోమవారం నగరంలోని 2వరోడ్డు పార్క్‌లో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి మోడల్ డీఎస్సీ పరీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈనెల 21న కోచింగ్ సెంటర్లలో, సెల్ఫ్ సెంటర్స్‌లో మోడల్ డీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను అభ్యర్థులందరూ ఉపయోగించుకొని తమ ప్రతిభను కనపరిచి ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలని డివైఎఫ్ఐ తరుపున ఆకాంక్షించారు. ఇతర వివరాలకు సెల్.. 99085 04321, 96180 62490 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు కదిరిలో నివాళులు అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ఆదర్శం.. సుందరయ్య జీవితం..!

జిల్లా వ్యాప్తంగా ఘనంగా వర్ధంతి కార్యక్రమాలు

మహానేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం మొత్తం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయం అని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. సమసమాజ దార్శనీకుడు, కష్టజీవులు, శ్రమ జీవుల పెన్నిధి, మెట్టమొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నేత, దక్షణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాలను సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో సుందరయ్య ప్రజా పోరాటాలను నాయకులు వివరించారు. చిన్న వయస్సులోనే బ్రిటీష్‌వారిని వ్యతిరేకించి, ఆంధ్రరాష్ట్రంలో ఉప్పు సత్యగ్రహానికి నాయత్వం వహించిన నేత సుందరయ్య అన్నారు. వ్యక్తిగత ఆస్తిని ప్రజలకు పంచి పెట్టిన త్యాగమూర్తి అన్నారు. సాధారణ వ్యక్తిగా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. అందరూ సమానం అంటూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. పార్లమెంటేరియన్‌గా, పోరాట యోధుడిగా ఆయన జీవితం స్ఫూర్తిగా తీసుకుని సోషలిజం సాధించే కృషిలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పట్టుదలగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వార్త 6లో

టిడిపి ఖాతాలోకి కదిరి మున్సిపాల్టీ

◆ గాండ్లపెంట ఎంపిపిని సొంతం చేసుకున్న అధికార పార్టీ ◆ మరోసారి వాయిదా పడిన రామగిరి ఎన్నిక

చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు

చైర్‌పర్సన్... దిల్షాదున్నిసా

వైస్‌చైర్మన్..రాజశేఖర ఆచారి

వైస్ చైర్మన్ సుధారాణి

ప్రజాశక్తి-కదిరి టౌన్,గాండ్లపెంట

వివిధ కారాణాలతో ఖాళీగా ఉన్న మున్సిపల్ ఛైర్మన్, ఎంపిపి స్థానాలకు సంబంధించి అధికారులు సోమవారం నాడు ఎన్నికను నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో కదిరి మున్సిపల్ ఛైర్మన్, గాండ్లపెంట, రామగిరి ఎంపిపి ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఇందులో కదిరి మున్సిపాల్టీ, గాండ్లపెంట ఎంపిపి పదవులను టిడిపి కైవసం చేసింది. కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా దిల్షాద్ ఉన్నీసా ఎన్నిక అయ్యారు. గాండ్లపెంట ఎంపిపిగా గజ్జల సోమశేఖర్‌రెడ్డి ఎన్నిక అయ్యారు. మరోసారి రామగిరి ఎంపిపి ఎన్నిక వాయిదా పడింది. కోరంలేకపోవడంతో ఈ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా రామగిరి ఎన్నిక ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడింది. ప్రస్తుతం మూడవ సారి కూడా వాయిదా పడడం గమనార్హం.

కదిరి మున్సిపాల్టీ టిడిపి కైవసం
ఛైర్‌పర్సన్‌గా దిల్షాదున్నిషా,
వైస్‌ఛైర్మన్లుగా రాజశేఖర ఆచారి, సుధారాణి

కదిరి టౌన్ : కదిరి మున్సిపాలిటీని అధికార తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. టిడిపి మద్దతుదారులు ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్‌ఛైర్మన్లగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కదిరి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎన్నికల అధికారి, ఆర్డీవో వివిఎస్.శర్మ అధ్యక్షతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఎన్నిక నేపథ్యంలో బెంగళూరు క్యాంపు నుంచి కౌన్సిలర్లు ప్రత్యేక బస్సుల్లో కదిరి మున్సిపాల్టీకి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. ఆర్డీవో వివిఎస్.శర్మ అధ్యక్షతన ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కదిరి మున్సిపాలిటీలో 36 మంది సభ్యులు ఉండగా 25 మంది టిడిపి కౌన్సిలర్లు టిడిపి మద్దతుదారులకు ఓటు వేశారు. దీంతో ఛైర్‌పర్సన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నిషా, వైస్‌ఛైర్మన్లుగా 19వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర ఆచారి, 21వ వార్డు కౌన్సిలర్ సుధారాణిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఎన్నికైన వీరికి ఎన్నికల అధికారి ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికకు వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కదిరి మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న నూతన ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లు

ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు

ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన అనంతరం ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, వైస్ ఛైర్మన్ రాజశేఖర్ ఆచారి, సుధారాణిలు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నేతలు బహుద్దిన్, బాబయ్యలతో కలిసి ఎమ్మెల్యేను కలిసి పూలబొకేలు అందించారు. తమపై నమ్మకంతో పదువులు ఇచ్చిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

గాండ్లపెంట ఎంపిపి టిడిపి వశం

ఎంపీపీగా సోమశేఖర్ రెడ్డి

ఎంపిపి... సోమశేఖర్‌రెడ్డి

గాండ్లపెంట : గాండ్లపెంట ఎంపీపీ టిడిపి ఖాతాలోకి వెళ్లింది. సోమవారం నిర్వహించిన ఎన్నికలో జి.సోమశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు ఎంపిటిసిలు హాజరయ్యారు. వైసిపికి చెందిన ముగ్గురు ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. కోరం ఉండటంతో ఎన్నికను అధికారులు నిర్వహించారు. ఎంపిపి అభ్యర్థిగా సోమశేఖర్‌రెడ్డిని ఎంపిటీసీ జయ రామకృష్ణారెడ్డి ప్రతిపాదించగా మరో ఎంపిటిసి భారతి బలపరచారు. పోటీ లేకపోవడంతో ఎంపీపీగా జి.సోమశేఖర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. అనంతరం ఆయనకు డిక్లరేషన్ పత్రాన్ని అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.బాబురావు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎన్.అమీర్‌బాషా, ఆర్ఐ అశోక చక్రవర్తి, ఎంపీటీసీ గంగోజమ్మ పాల్గొన్నారు.

రామగిరి ఎంపీపీ ఎన్నిక మళ్లీ వాయిదా

రామగిరిలో ఎంపిపి ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ఎంపిటిసిల గైర్హాజరుతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎంపిపి ఎన్నికకు సంబంధించి అధికారులు సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నిక కార్యక్రమానికి ముగ్గురు ఎంపిటిసిలు మాత్రమే హాజరయ్యారు. తగినంత మంది ఎంపిటిసిలు రాకపోవడంతో అధికారులు ఎన్నికను నిర్వహించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి సంజీవయ్య తెలిపారు. కాగా ఇప్పటికే రామగిరి ఎంపిపి ఎన్నిక రెండు సార్లు వాయిదా పడింది. మూడవ సారికూడా వాయిదా పడడంతో ఈ ఎన్నిక ఎప్పటికి పూర్తవుతుందోనని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతం కావడం, గత ఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు రామగిరిలో ఉదయం నుంచి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు పెనుకొండలో టిడిపి మినీ మహానాడు

ప్రజాశక్తి-పెనుకొండ

ఈ నెల 21వ తేదీ పట్టణంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మినీ మహా నాడు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్లు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమ వారం మండల కన్వీనర్లు, నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో టిడిపి మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతు న్నాయని తెలిపారు. అలాగే ఈ నెల 21న పెనుకొండలో నియోజకవర్గస్థాయి మహానాడు, 24న పుట్టపర్తిలో జిల్లా స్థాయి మహానాడు సమావేశాలు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలో జరిగే మినీ మహానాడులో టిడిపి ప్రజాప్రతినిధులు, పార్టీ పరిశీలకులు, ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, సిద్ధలింగప్ప, గోవిందరెడ్డి, నాయకులు నాగలూరు నారాయణస్వామి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, పాలడుగు చంద్ర, బాబుల్ రెడ్డి, సాయిప్రసాద్, రేపటి సుబ్రహ్మణ్యం, చంద్రకాంతమ్మ, గోపాల్, నారాయణనాయక్, శ్రీనివాసులు, కురుబ నంజుండ, అంజినాయక్, రాజేంద్రప్రసాద్, బోయ రాము, సోము, అంజేనాయక్, మల్లికార్జున, వెంకటలక్ష్మి, ప్రసాద్, రంజిత్ పాల్గొన్నారు.

పెనుకొండలో సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మినీ మహానాడును జయప్రదం చేయండి

గోరంట్ల : పెనుకొండ పట్టణంలో ఈ నెల 21వ తేదీ జరిగే మినీ మహానాడుకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి జయప్రదం చేయాలని మండల కన్వీనర్ సోమశేఖర్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ కడపలో జరిగే మహానాడుకు పెద్దఎత్తున తరలివెళ్లాలని కోరారు. సమావేశంలో నాయ కులు బాలకృష్ణచౌదరి, నరేష్, వేణు, జయరామ్, అజ్మతుల్లా, ఉత్తమరెడ్డి, నిమ్మల శ్రీధర్ పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధే ధ్యేయం

మినీ మహానాడులో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర

ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించి ఆ దిశగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. తెలుగు ప్రజల పసుపు పండుగ మహానాడు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఎంపి బికె.పార్థసారథి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై టిడిపి జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వక్క మార్కెట్ ఏర్పాటు, మడకశిరలో ఆర్‌డిఒ కార్యాలయం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రైతులకు పారదర్శకంగా ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశా మన్నారు. త్వరలో మరో 500 ట్రాన్స్‌ఫార్మర్లు, 20 సబ్ స్టేషన్లు రాబోతున్నాయన్నారు. 150 బోర్లు వేయించామన్నారు. ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తామన్నారు. పార్టీకి ద్రోహం చేసిన వారెవరినీ సహించబోమన్నారు. నాయకులు, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడుకుంటా మన్నారు. గ్రూపులు కట్టి పార్టీని డ్యామేజ్ చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. పార్టీ కోసం పని చేసి ప్రాణాలు కోల్పోయిన నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలిపారు. అంతకుముందు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్.గురుమూర్తి, మండలాల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, మద్దనకుంటప్ప, గణేష్, దాసిరెడ్డి, నాయకులు విఎం. పాండురంగప్ప, క్రిష్టప్ప, కృష్ణమూర్తి, నరసింహప్ప, మీనాక్షి రామిరెడ్డి, మంజునాథ్, రాజు, హేమంత్, లక్ష్మీనర్సప్ప, భరత్, భీమరాజు, జయప్ప, ప్రసాద్, రమేష్, పుట్ట కామప్ప, తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ఆర్‌డిటిని కాపాడుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-గోరంట్ల

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఆర్‌డిటి(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్)ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని సామాజిక సేవాకర్త ఉపాధ్యాయుడు జగదీష్ పిలుపునిచ్చారు. ఆర్‌డిటికి విదేశీ నిధులకు సంబంధించిన ఎఫ్‌సిఆర్ఎని వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. ర్యాలీలో ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సేవ్ ఆర్‌డిటి పేరుతో ర్యాలీ చేపట్టిన నాయకులు

రొప్పాలలో మూతపడిన వాటర్ ప్లాంట్

తాగునీటి కోసం ప్రజలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని రొప్పాల గ్రామంలో గత ప్రభుత్వంలో 2022లో నీతి ఆయోగ్ నిధుల కింద దాదాపు రూ. 17 లక్షలు ఖర్చు చేసి 1,500 ఎల్‌పిహెచ్ సామర్థ్యంతో వాటర్ ప్లాంట్ నిర్మించారు. సుమారు 2 వేల జనాభా ఉన్న రొప్పాల గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న పి.కొత్తపల్లి, దండేపల్లి గ్రామాల ప్రజలు ఈ వాటర్ ప్లాంట్ నుంచి తాగునీరు తీసుకెళ్లేవారు. దీనికితోడు రొద్దం నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారి కావడం, నిత్యం వాహనాల రద్దీ ఉండే ప్రాంతం కావడంతో రోజూ ప్రయాణికులు కూడా ఇక్కడ దాహార్తి తీర్చుకునేవారు. సమీపంలోనే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉండడంతో వివిధ గ్రామాల నుంచి బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు ఈ వాటర్ ప్లాంట్ అనుకూలంగా ఉండేది. అయితే ఈ వాటర్ ప్లాంట్ కొంతకాలంగా మూతపడడం, ఈ ప్రాంతంలో మరో వాటర్ ప్లాంట్ లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. అంతేకాకుండా రూ. లక్షల విలువ చేసే పరికరాలు తుప్పు పట్టి పోతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఈ వాటర్ ప్లాంట్‌ను తిరిగిమ వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రొప్పాలలో మూతపడిన వాటర్ ప్లాంట్

ఎప్పటికప్పుడు అర్జీలకు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలను పరిష్కరించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన 206 అర్జీలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య ఇతర శాఖల జిల్లా అధికారులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో కలెక్టరేట్‌కు వస్తారన్నారు. వారి ఆశలకు అనుగుణంగా అర్జీల పరిష్కారంపై బాధ్యతగా పని చేయాలన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమం లో డిఆర్ఓ విజయసారథి, ఆర్డీవో సువర్ణ, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, పశుసంవర్ధక శాఖ జెడి శుభదాస్, ఎపిఎంఐపి పీడీ సుదర్శన్, సిపిఒ విజయ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

జిల్లాలో ఎల్లో అలర్ట్ : కలెక్టర్

వర్షాల నేపథ్యంలో జిల్లాలో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించిందని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ సోమవారం నాడు ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఈదుల గాలులతో వడగండ్లతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. నది పరివాహక ప్రాంతం, చెరువు లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తహశీల్దార్లు, ఆర్డీవోలు ఆయా కేంద్రాల్లో ప్రజలకు ఉండాలని తెలిపారు.

పొలాల్లో వాలిన విద్యుత్ స్తంభాలు

మనిషికి అందేఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక జగనన్న కాలనీ వెనుక వైపు ఉన్న పంట పొలాల్లో వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ స్తంభాలు ఓ వైపు వాలిపోయాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని ఆయా పొలాల రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు విద్యుత్ తీగలు అందే ఎత్తులో వేలాడుతున్నాయని, పొలాల్లో పని చేసే సమయంలో రైతులకు కానీ, ట్రాక్టర్లకు కానీ విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం ఉందని వాపోయారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ఏదైనా ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు వాటిని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

పొలంలో వాలిన విద్యుత్ స్తంభాలు



పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎపిఒలు నాగిరెడ్డి, శ్రీకాంత్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఆధార్ కార్డు, వన్ బి, బ్యాంకు అకౌంటు జిరాక్స్ తీసుకెళ్లి ఉపాధి హామీ సిబ్బందికి అందజేయాలన్నారు.

9న ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-మడకశిర

2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సిద్ధార్థ గౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు తెలిపారు. ఆయన సోమవారం సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిసి బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. హనుమంతు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో(పదో తరగతి, ఇంటర్, డిగ్రీ) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జూన్ 9వ తేదీ పట్టణంలోని డిహెచ్ పిఎస్ కార్యాలయంలో సిద్ధార్థ గౌతమ బుద్ధ ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పవిత్ర, ఉమేష్‌నాయక్, అంజి, రవి, స్వామికుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

రాయలసీమ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ కార్యదర్శిగా శబరీష్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

రాయలసీమ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ అనంతపురం కార్యదర్శిగా కాళంగి కె.శబరీష్ నియమితు లయ్యారు. ఈ మేరకు సోమవారం ట్రస్ట్ అధ్యక్షుడు పోలమాడ రమేష్‌బాబు, జనరల్ సెక్రటరీ భలభద్ర మనోజ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. విద్య, సామాజిక సేవా రంగాల్లో శబరీష్ విశేష సేవలం దించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. సమాజం పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతకు గుర్తింపుగా ఈ బాధ్యత అప్పగించారు. శబరీష్ మాట్లాడుతూ ఈ అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

గ్రామీణోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో అనంతపురానికి చెందిన హర్ష టయోటా కంపెనీ వారు ఏర్పాటు చేసిన టయోటా గ్రామీణోత్సవాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణ మోహన్ నాయుడు, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రబృందం సర్వే

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని మర్రికొమ్మదిన్నె పంచాయతీలో బంగారు గనుల నిమిత్తం ఆ బ్లాక్ ఏరియాను కేంద్రబృందం అధికారులు సోమవారం పరిశీలించారు. సర్వే ఆఫ్ ఇండియా శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆ బ్లాక్ ఏరియాలో 250 ఎకరాలు ఎవరికీ అప్పగించరాదని ఆదేశించారని తహశీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర జిఎస్ఐ డైరెక్టర్ ఫ్రిడిక్ రోనాల్డ్, రాష్ట్ర జిఎస్ఐ డైరెక్టర్ వివేక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని లక్ష్మి చెన్నకేశవపురం 26వ వార్డుకు చెందిన టిడిపి కార్యకర్త బాలప్ప సోమవారం మృతిచెందాడు. దీంతో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు టైలర్ గోపాల్ తదితరులు మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహులు, నాగంజి ,రషీద్ ఖాన్, షఫీ, వంశీ ,ఉపేంద్ర, బాలకృష్ణ, నాగేంద్ర, చికెన్ నాగేంద్ర, వెంకటరాముడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి డుమ్మా కొట్టిన మండల అధికారులపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు తహశీల్దార్ అనంతాచారి తెలిపారు. ప్రజా గ్రీవెన్స్ కు తొమ్మిది శాఖల అధికారులు హాజరుకాగా 11 శాఖల అధికారులు హాజరు కాలేదన్నారు ఈ విషయం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

22న మినీ మహానాడు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

టిడిపి స్థానిక కార్యాలయంలో ఈనెల 22న మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు, అనుబంధ శాఖల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనివిజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తలుపుల బిల్ కలెక్టర్‌పై వేటు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

తలుపుల గ్రామపంచాయతీలో బిల్ కలెక్టర్ గా పని చేస్తున్న ఆర్ గంగాధర్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీ సత్య సాయి జిల్లా డిపిఒ కార్యాలయం నుండి సమాచారం అందింది. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు కాబడిన ఇంటి పన్నులను గ్రామపంచాయతీ అకౌంటుకు జమ చేయకుండా, తన సొంత పనులకు వాడుకొన్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా మార్చి 1వ తేదీ నుండి పై అధికారుల అనుమతి లేకుండా విధులకు హాజరు కాకపోవటంతో పాటు అతనిపై గ్రామపంచాయతీ పరిధిలో పలువురు ఆరోపణలు చేయడంతో వాటిపై ఉన్నతాధికారులు విచారణలు చేపట్టారు. ఈ మేరకు వారి విచారణలో వాస్తవాలు వెల్లడికావటంతో విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి -పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాలతోపాటు జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ, ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. .ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన చేశారు.

వైసిపి ఎస్సీ సెల్ నాయకుడు మృతి

తాడిమర్రి : మండల పరిధిలోని పిన్నదరి గ్రామానికి చెందిన వైసిపి ఎస్సీ సెల్ నాయకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన సత్యనారాయణ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ డిసిఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి సోమవారం సత్యనారాయణ ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళు లర్పించారు. బాధితులను పరామర్శించారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పెనుకొండ నాయకులు

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సోమందేపల్లి నాయకులు

వర్ధంతి సభలో ప్రముఖులు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందరయ్య తల్లిదండ్రులతో విభేదించి పేదలకు సొంత భూమిని పంచిపెట్టిన మహనీయులన్నారు. దేశంలో కూలీ సంఘాలు ఏర్పాటు చేసి కూలి రేట్లు పెంచాలని పోరాడిన గొప్ప వ్యక్తి అన్నారు. నేటి తరం ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో శివ, సుధాకర్, హనుమంతు, ముత్యాలు, ఓబులేసు, హనుమంతు, అక్కులప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన పార్టీ మండల కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, బెస్త కిష్టప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, నాగభూషణ, రవి, ఆవాజ్ మండల నాయకులు మాబు, తుంగోడు వెంకటేష్, గోవిందప్ప, ఈడిగ నాగరాజు, పటాకుల శీన, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు మీసాల ఆంజనేయులు, లక్ష్మీదేవి, నాగరాజు, ఆనందప్ప, విశ్వనాథ్, రెహమాన్, షాంషీర్ పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలోని పాలసముద్రం సమీపంలో ఉన్న సిపిఎం కాలనీలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ సుందరయ్య పేదల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, రామాంజనేయులు, అంజలి, అచ్చుమ్మ, గంగరత్నమ్మ, వెంకటలక్ష్మమ్మ, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : సిపిఎం స్థానికకార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లిసుందరయ్య వర్ధంతిని ఆ పార్టీ నాయకులు, సిఐటియు నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా మాట్లాడుతూ సుందరయ్య చేసిన సేవలను వివరించారు. ఆయన జీవితం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఆలకుంట మారుతి, సిఐటియు నాయకులు జెవి. రమణ, టి. అయూబ్ ఖాన్. ఎల్, ఆదినారాయణ, వి, వెంకటస్వామి, నారాయణస్వామి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : సిపిఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పట్టణంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆపార్టీ పట్టణ కార్యదర్శి జిఎల్ నరసింహులు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో సుందరయ్య ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబ్జాన్, రామ్మోహన్, శివ, శాంతిబాయి, మున్ని, లక్ష్మీబాయి, జయశ్రీ, మహబూబ్ జాన్, సుధాకర్ రెడ్డి, ఫాజిల్, రఫీ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండలకేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి రమణ, కుళ్లాయప్ప, అంజి, బాషా, నాగేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : సిపిఎం నాయకుల పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ లోని సుందరయ్య కాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. సమానత్వ సమాజం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, నాగరాజు, నరసింహ, నారాయణప్ప, రజీయామ్మ, ఐయాజ్, గాయిత్రి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం పుట్టపర్తి డివిజన్ ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి తెలిపారు. కొత్తచెరువులోని పెనుగొండ రోడ్డు నందు పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, శంకర్ రెడ్డి, గంగాధర్, బాషా, నారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి అన్న క్యాంటీన్ సమీపంలో సిపిఎం, సిఐటియు నాయకులు సుందయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైపల్లి గంగాధర్, నాగార్జున, వెంకటేష్, లక్ష్మయ్య, సోడా వెంకటేష్, సరోజమ్మ, అనిత, సాయమ్మ పాల్గొన్నారు.

నల్లమాడ : మండల కేంద్రంలో బస్టాండ్ సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందు, మల్లికార్జున, రాజు, రంగమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

చిలమత్తూరులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అంతర్జాతీయ సదస్సులో ఎన్ఎస్‌పిఆర్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

మంగళూరులోని యెనుపోయో విశ్వవిద్యాలయంలో ఈ నెల 15, 16వ తేదీలలో జరిగిన ఐకాన్ యూత్-2025 అంతర్జాతీయ సదస్సులో హిందూపురం ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బికాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఏ.మదీహ ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. యం. ప్రగతి విద్యార్థినిని సోమవారం అభినందించారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో జరిగిన ఈ అంతర్జాతీయ వేదికలో ఆధునిక యుగంలో ప్రజారోగ్య ప్రాముఖ్యత పై చైతన్యం కల్పించడంలో యువత పాత్ర అనే అంశంపై తమ విద్యార్థిని మదీహ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా పోస్టర్ ప్రజెంటేషన్ చేసి, ప్రశంసలు పొందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, కార్యాలయ సిబ్బంది లక్ష్మి, సిద్దలింగప్ప, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి

నిందితులను కఠినంగా శిక్షించాలి : బిఎస్‌పి

ప్రజాశక్తి-హిందూపురం

తిరుపతి మోహన్ బాబు కాలేజీలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న జేమ్స్ పై జూనియర్ విద్యార్థులు రౌడీ షీటర్లతో కుమ్మక్కై దాడి చేయడాన్ని బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీరాములు మాట్లాడుతూ, జేమ్స్ ను విచక్షణా రహితంగా కొట్టి దౌర్జన్యం చేసిన సంఘటన పై కూటమి ప్రభుత్వం స్పందించక పోవడం చాలా దారుణమని విచారం వ్యక్తం చేశారు. హిందూపురం పార్లమెంట్ బిఎస్పీ ఇంచార్జ్ కొల్లకుంట వడ్డే నాగరాజు మాట్లాడుతూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతుంటే బహుజనులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెన్నయ్య, వడ్డే మంజునాథ్, కొట్నూరు గంగప్ప, నరసింహప్ప ప్రేమ్ నాథ్, గంగాధర్, గోపి, రాజప్ప, మధు, మోతుక పల్లి క్రిష్టప్ప, నారాయణస్వామి, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్‌పి నాయకులు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని బూచేపల్లి గ్రామంలో సోమవారం చరణ్‌కుమార్(33) ఇంటి సమీపంలోని ఓ చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ బోయ శేఖర్ తెలిపారు. వివరాలు.. చరణ్‌కుమార్‌కు ఇది వరకే పెళ్లి కాగా మొదటి భార్యకు విడాకులు ఇచ్చారు. అనంతరం బూచేపల్లి గ్రామంలోని బంధువుల అమ్మాయిని రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు కూడా పిల్లలు పుట్టకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. చరణ్ తండ్రి నరసింహప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణ సమీపంలో గల కురుబ కళ్యాణమండపం వెనుకన రైల్వే ట్రాక్‌పై పట్టణానికి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి మృతిచెందాడు. స్థానిక సిద్దయ్య గుట్టకు చెందిన బుక్కరాయసముద్రపు శ్రీనివాసులు(63) బార్బర్ వృత్తి చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఈయన గత 20 సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బెంగళూరు, అనంతపురంలోని ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకుంటున్నాడు. అయినా ఆరోగ్యం బాగుపడకపోవటంతో మనస్థాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం బెంగుళూరు - ధర్మవరం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని వేల్పుమడుగు క్రాస్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతిచెందాడు. బండలతో వెళుతున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది, ముదిగుబ్బ గ్రామానికి చెందిన మట్రా ఆంజనేయులు(59), భార్య అలివేలమ్మతో కలసి ధర్మవరం మార్కెట్లో తెల్ల గడ్డలు కొనుగోలు చేసి గ్రామాలలో విక్రయిస్తూ జీవనం చేసేవాడు. ఆ క్రమంలోనే సోమవారం ఉదయం ఆటోలో ముదిగుబ్బ నుండి ధర్మవరం వెళ్తుండగా వేల్పుమడుగు క్రాస్ సమీపంలో బండలతో వెళుతున్న ట్రాక్టర్ వెనక నుండి ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న ఆంజనేయులు తలకు బలమైన రక్తగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన అలివేలమ్మను బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అలివేలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'ఉపాధి' సిబ్బంది అక్రమాలను అరికట్టాలి: సిపిఎం

ఎంపిడిఒతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో కొందరు సిబ్బంది చేస్తున్న అక్రమాలను అరికట్టాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం, సిపిఐ నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎంపిడివో పార్థసారధికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి పథకంలోకి కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారని విమర్శించారు. సిబ్బంది చేస్తున్న అక్రమాలను ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మండల కేంద్రంలో అక్రమంగా వెలుస్తున్న లే అవుట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాగులు, వంకలు కబ్జా చేసి అందులో ప్లాట్లు వేసి అమాయకులకు విక్రయిస్తున్నారని ఈ విషయంలో అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులకు మేలు కలిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగిరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు సూర్యనారాయణ రెడ్డి,మండల కార్యదర్శి జి రమణ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు బస్టాండ్ కూడలి లోని నాలుగు రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని తహశీల్దార్ నీలకంఠ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి, జనసేన, వైసీపీ నాయకులు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఉన్న విగ్రహాలను తొలగించారని జిల్లా కలెక్టర్ చేతన్‌కు కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారని ఆయన వాటి పైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. దీనితో సమావేశాన్ని నిర్వహించి నాయకులతో అభిప్రాయాలను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. వారి అభిప్రాయం మేరకు రోడ్ల వెడల్పు కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్ఎంబి అధికారులను పిలిపించి రోడ్ల ఇరువైపులా కొలతలను నిర్వహించి ఆక్రమణాలను తొలగిస్తామన్నారు. రెండు రోజుల లోపల రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు తమ ఆక్రమణలను తొలగించుకోవాలన్నారు. గడుల లోపలే వ్యాపారాలు నిర్వహించుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌పై పండ్ల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఒకటో సచివాలయం పక్కన గ్రామపంచాయతీ స్థలంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సురేష్, ఎంపీడీవో నటరాజ్, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వీఆర్వో నజీర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి గాండ్లపెంట

మండలంలోనిపనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ బి బాబురావుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు 20 నుంచి 30 నెలల వరకు స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. వారి సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు పనిలోకి వెళ్లమని భీష్మించుకు కూర్చొన్నారు. సమస్యను ఎంపిడిఒ , ఇఒఆర్‌డితో చర్చించి పది రోజుల్లో వేతనాలు చెల్లిస్తామని తహశీల్దార్ బాబురావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్వచ్ఛభారత్ యూనియన్ కార్మికుడు అక్కులప్ప, అంజి. కదిరప్ప, అనిల్, గంగులప్ప, బాలకృష్ణతో పాటు దాదాపు 20 మంది కార్మికులు పాల్గొన్నారు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-పావగడ

వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్ తెలిపారు. తాలూకాలోని పెండ్లిజీవి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ, అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల ప్రజలకు అన్ని రంగాల్లో సౌకర్యాలు అందేలా కృషి చేసిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అన్నారు. ప్రతి గ్రామంలో అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అంబేద్కర్, గాంధీ, నెహ్రూ ఆశయాలను తెలిపి స్వాతంత్ర్య పోరాటంలో వారి త్యాగాలను చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాగలమడిక గ్రామపంచాయతీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు ఆర్ఎ. హనుమంతరాయప్ప, మంజునాథ్, నెర్లకుంట నాగేంద్ర, నాయకులు గోపాల్, విఎస్ఎస్ఎన్ అధ్యక్షుడు పాలనాయక్, కె.మంజునాథ్, కెబి.నాగరాజు, నారాయణ్, గిరీష్ పాల్గొన్నారు.

రక్తపోటు సైలెంట్ కిల్లర్

ప్రజాశక్తి-పావగడ

అధిక రక్తపోటు వల్ల అనేక సమస్యలు వస్తాయని, కావున ఏడాదికి రెండుసార్లు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని టిహెచ్ఒ డాక్టర్ బాబు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెడు అలవాట్లు, వేపుడు పదార్థాలను ఎక్కువగా తినడంవల్ల ప్రజలు అధిక రక్తపోటుకు గురవుతున్నారని తెలిపారు. ఒక్కసారి ఈ వ్యాధి వస్తే జీవితాంతం వెంటాడుతుందని, సమతుల ఆహారం తీసుకోవడం, ధ్యానం, యోగా చేయడం ద్వారా ఈ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిడి వైద్యులు షమీన్‌బాను, సిబ్బంది చంద్రకళ, ఎండి ఖాసిం, ఆర్.ఓంకార్, గొల్లాలప్ప, లలితమ్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయని డీఈవో క్రిష్టప్ప తెలిపారు. సోమవారం తెలుగు పరీక్షను 34 కేంద్రాల్లో నిర్వహించగా 1554 మందికి గాను 1135 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

నల్లమాడ: మండల కేంద్రంలో సోమవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ తెలుగు పరీక్ష సజావుగా జరిగింది. ఈ పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అధికార పార్టీ వైపు మొగ్గు

కదిరి మున్సిపాలిటీ, గాండ్లపెంట ఎంపిపి అధికార పార్టీ ఖాతాలో

కోరం లేక రామగిరి ఎంపిపి ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గత కొన్ని నెలలు అధికార మార్పిడి అధికార పార్టీ చేపట్టిన ప్రయత్నాలు కదిరిలో ఫలించాయి. రామగిరి మండల పరిషత్ మాత్రం ఇప్పటికీ ఎవరి పక్షాన చేరలేదు. ఈసారి అక్కడ వాయిదా పర్వం తప్పలేదు. సత్యసాయి జిల్లాలో స్థానిక సంస్థల అధికార మార్పిడి వ్యవహారం గత కొన్ని రోజులుగా రాజకీయ వేడిని రాజేస్తూ వచ్చాయి. స్థానిక సంస్థ ఎన్నికల్లో అప్పటి అధికార వైసిపి అత్యధిక స్థానాల్లో గెలుపొంది అన్ని స్థానిక సంస్థల్లోనూ పాగా వేసింది. అవిశ్వాసానికి నాలుగేళ్ల సమయం పూర్తవడంతోపాటు ఇప్పుడు అధికారంలో టిడిపి వచ్చింది. టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక సంస్థలను ఏదో రకంగా చెజెక్కించుకునే ప్రయత్నాలు చేసింది. ఇందులో ఇప్పటికే హిందూపురం పురపాలక సంఘాన్ని దక్కించుకుంది. మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరడంతో మున్సిపాల్టీని టిడిపి దక్కించుకున్నట్టయింది. కదిరి మున్సిపాలిటీ మాత్రం మూడుసార్లకుపైగా వాయిదా పడుతూ వచ్చింది. కదిరి మున్సిపాలిటీలో 36 మంది కౌన్సిలర్లు ఉంటే అత్యధిక మంది వైసిపి వారే ఉండటంతో ఛైర్మన్‌గా ఉంటూ వచ్చారు. అవిశ్వాస సమయం రావడంతో ముందున్న ఛైర్మన్‌ను దించి కొత్తగా మరొకరవ్వాలన్న యోచనతో పాలకవర్గంలో చీలికలొచ్చాయి. ఈ చీలికలను అధికార పార్టీ తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పలుదఫాలు ప్రయత్నించి విఫలమైంది. ఎట్టకేలకు ఈసారి 25 మందిని తమ వైపు తిప్పుకుని పాలకవర్గ మార్పులో తమ మార్కును వేసుకునే విషయంలో విజయవంతమైంది. 11 మంది కౌన్సిలర్లు వైసిపి వైపే ఉండిపోయారు. మెజార్టీ టిడిపి వైపు రావడంతో వారనకున్న ఛైర్మన్ అభ్యర్థి దిల్‌షాద్‌దున్నిసాను చేశారు. వైస్ ఛైర్మన్లుగా రాజశేఖర్ ఆచారి, సుధారాణిలను చేశారు. ఇదే తరహాలో గాండ్లపెంట ఎంపిపి స్థానాన్ని గుజ్జల సోమశేఖర్‌రెడ్డిని చేశారు. ఈ జిల్లాలో చాలాకాలం రసవత్తరంగా సాగుతూ వచ్చిన రామగిరి మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక మాత్రం జరగలేదు. దీన్ని ఎలాగైనా తమ ఖాతాలో వేసుకోవాలని అధికార టిడిపి అనేక రోజులుగా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఉన్న తొమ్మిది మందిలో ఐదు మందిని తమ వైపు తిప్పుకుంటే అధికార మార్పిడి జరుగుతుంది. అయితే అది సాధ్యపడటం లేదు. ఈ ఎన్నికలకు కొన్ని రోజులు ముందుగా ఎంపిటిసిలు టిడిపి కండువాలు కప్పుకుని కనిపించారు. దీంతో ఈసారి రామగిరి ఎంపిపి దక్కించుకుంటుందని భావించారు. మరుసటి రోజే వైసిపి అప్రమత్తమై కండువాలు కప్పుకున్న వారిని తిరిగి తమ వైపు తీసుకెళ్లారు. దీంతో మెజార్టీ బలం అధికార టిడిపికి కొరవడింది. వైసిపి ఎంపిటిసిలెవరు ఈ ఎన్నికకు హాజరవలేదు. కోరం లేకపోవడంతో ఈసారీ మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక జరగకుండానే వాయిదా పడింది. ఇలా రామగిరి ఎంపిపి స్థానం మాత్రం సాధారణ ఎన్నికకు మించి రసవత్తరంగా మారుతోంది. అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి మధ్య పోటీపోటాగా రాజకీయ ఎత్తులు సాగుతున్నాయి. ఇది ఎప్పటి తేలనుందన్నది ఆసక్తికరంగా మారింది.